

వైఎస్సార్ సీపీకే మైనార్టీల మద్దతు

మైనార్టీల సంక్షేమానికి కట్టుబడిన వైఎస్సార్ సీపీకే తమ మద్దతు అని రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ షంషీర్ ఆలీబేగ్ పేర్కొన్నారు.

- 8లో..



సంక్షేమం వైఎస్సార్ సీపీకే సాధ్యం

వైఎస్సార్ సీపీ మళ్లీ అధికారంలోకి వస్తేనే సంక్షేమ పథకాలు అందుతాయని మంత్రి మేరుగు నాగార్జున అన్నారు.

- 8లో..

గరిష్ఠం/కనిష్ఠం
44/27

వాతావరణం

వాతావరణం ఉక్కపోతగా ఉంటుంది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల జల్లులు పడవచ్చు.

న్యూస్‌రీల్

పలు ప్రాంతాల్లో భారీ వర్షం


ఒంగోలు: జిల్లాలోని పలు ప్రాంతాల్లో మంగళవారం భారీ వర్షం కురిసింది. సాయంత్రానికి వాతావరణం ఒక్కసారిగా మేఘావృతమై చల్లని గాలులు వీచాయి. ఉరుములు, మెరుపులతో వర్షం పడింది. మార్కాపురం, గిద్దలూరు, కొండపి, కనిగిరి, యర్రగొండపాలెం, సంతనూతలపాడు, ఒంగోలు నియోజకవర్గాల్లో ఈదురుగాలులతో భారీ వర్షం కురిసింది. ఒంగోలు నగరంలో గంటపాటు కుండపోత వాన కురిసింది. ఈదురుగాలులతో పలుచోట్ల చెట్లు నేలకొరిగాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది.

ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలి



ఒంగోలు అర్బన్: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఈ నెల 13వ తేదీ జరిగే పోలింగ్‌లో ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరూ ఓటు వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ అన్నారు. స్థానిక మినీ స్టేడియం నుంచి మంగళవారం ప్రకాశం భవనం, కోర్టు సెంటర్ మీదుగా మంగమూరు డొంక బైపాస్ వరకు ఓటరు అవగాహన బైక్‌ర్యాలీ స్వీప్ నోడల్ అధికారి రవికుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. తొలుత ర్యాలీకి వచ్చిన ఎన్‌సీసీ కార్యకర్తలు, వివిధ కళాశాలల విద్యార్థులు, దివ్యాంగులు, వివిధ వర్గాల యువతను ఉద్దేశించి కలెక్టర్ ప్రసంగించారు. ముఖ్యంగా యువత ఓటు హక్కును తప్పక వినియోగించుకోవడంతో పాటు ప్రజలను చైతన్య పరచాలన్నారు. స్వేచ్ఛాయుత ఎన్నికలకు ప్రతీకగా పావురాలు ఎగురవేశారు. రంగు రంగుల బెలూన్‌లు గాలిలోకి విడిచిపెట్టారు. జెండా ఊపిన కలెక్టర్ బైక్‌ర్యాలీకి సారథ్యం వహించారు. దీనిలో స్వీప్ అధికారులు జ్యోతి, క్రీడా ప్రాధికార సంస్థ కోచ్ రాజరాజేశ్వరి, డీఎంహెచ్ఓ సురేష్, జిల్లా అధికారులు ఏడీ అర్చన, హేమంత్, అర్జునరావు, ఒంగోలు ఆర్డీవో సుబ్బారెడ్డి, ఓఎంసీ కమిషనర్ జస్వంత్‌రావు, డివిజనల్ పీఆర్ఓ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల నిధుల్లో పర్సెంటేజీలు నొక్కడం.. అడ్డగోలుగా పనులు చేస్తున్నా కిమ్మనకుండా చోద్యం చూడటం.. భూములు కబ్జా చేసి అప్పనంగా సొమ్ము చేసుకోవడం.. ఇసుకను తెగనమ్మి జేబులు నింపుకోవడం.. పేదలకు న్యాయంగా దక్కాల్సిన పథకాలకు ఉద్దేశపూర్వకంగా కత్తెర వేయడం.. ఇదీ 2014–19 మధ్య టీడీపీ జమానాలో సంతనూతలపాడు నియోజకవర్గంలో పచ్చ నేతల వ్యవహార శైలి. అక్రమాలకు అడ్డు తగిలిన వారిపై కేసులు బనాయించి, సర్పంచ్‌ల చెక్ పవర్ సైతం రద్దు చేయించడంలో బీఎన్ విజయ్‌కుమార్ చూపిన అత్యుత్సాహాన్ని నియోజకవర్గ ప్రజలు ఇంకా మరువలేదు. గత ఎన్నికల్లోనూ ఇక్కడ తుక్కైన సైకిల్‌కు మరమ్మతులు చేసి మళ్లీ పెత్తనం చేయాలని ఆయన తహతహలాడుతున్నారు.



పేరుకే పెద్ద.. పచ్చ గద్ద

పెత్తనానికి తహతహ

- టీడీపీ జమానాలో సంతనూతలపాడు నియోజకవర్గంలో ప్రజా ధనం లూటీ
- నీరు–చెట్టు నిధుల దోపిడీ, భూ కబ్జాల్లో పోటీ పడిన పచ్చ చొక్కాలు
- జన్మభూమి కమిటీల పేరుతో సంక్షేమ పథకాలకు కత్తెర
- నాడు.. వైఎస్సార్ సీపీ మద్దతుదారులైన సర్పంచ్‌ల చెక్‌పవర్ రద్దు
- తెలుగు తమ్ముళ్ల దోపిడీకి అండగా నిలిచిన బీఎన్ విజయ్‌కుమార్

సాక్షి నెట్‌వర్క్ : సంతనూతలపాడు నియోజకవర్గం మద్దిపాడు, నాగులుప్పలపాడు మండలాల్లో గుండ్లకమ్మ పరివాహక ప్రాంతంలో టీడీపీ నేతలు రోజుకు 300 ట్రాక్టర్ల ఇసుక అక్రమంగా రవాణా చేసి రూ.కోట్లు సంపాదించారు. మల్లవరం, కొలచనకోట, వెల్లంపల్లి, గాజులపాలెం, మద్దిపాడు, రాచవారిపాలెం, నందిపాడు, ఇనమనమెళ్లూరు గ్రామాల్లో వారు ఇష్టానుసారంగా ఇసుక తవ్వి సొమ్ము చేసుకున్నారు. మల్లవరం వద్ద ఇసుక రీచ్ ఏర్పాటు చేస్తే తమ పొలాలు పోతాయని అన్నంగి గ్రామస్తులు విజ్ఞప్తి చేసినా పెడచెవిన పెట్టారు. పొలాల అంచుల్లో ఇసుక తోడుతుండడంతో మట్టిపెళ్లలు విరిగి పడి సన్నపోగు చిన్నయ్య(49) అనే ట్రాక్టర్ డ్రైవర్ మరణించాడు. అప్పటి తహసీల్దార్ ఇసుక రీచ్‌ను మూసివేసినా టీడీపీ నాయకుల ఒత్తిడికి తలొగ్గి మళ్లీ తవ్వేందుకు అనుమతిచ్చారు. ఈ అక్రమాలు, అరాచకాల వెనుక బీఎస్ విజయ్‌కుమార్ ఉన్నారన్న ఆరోపణలు వెల్లువెత్తాయి.

కాసులు కురిపించిన నీరు–చెట్టు

టీడీపీ జమానాలో 2015 నుంచి 2018 వరకు నియోజకవర్గంలో 529 పనులు మంజూరు కాగా రూ.41.12 కోట్లు కేటాయించారు. ఈ నిధుల్లో సుమారు రూ.20 కోట్లు టీడీపీ ముఖ్య నేతలు, వారి అనుచరుల జేబుల్లోకే చేరాయి. నిబంధనలకు విరుద్ధంగా పొక్లెయిన్లు, ఇతర యంత్రాలు వినియోగించి, అధికారుల నోరు నొక్కేసి బిల్లులు డ్రా చేసుకున్నారు. ఉపాధి హామీ పనులు చేసిన ప్రదేశాల్లోనే నీరు–చెట్టు పేరుతో పనులు చేపట్టినట్లు చూపి బిల్లులు పొందడంపై అప్పట్లో పెద్ద ఎత్తున విమర్శలొచ్చాయి. మూడు మీటర్ల కంటే ఎక్కువ లోతు తవ్వకూడదన్న నిబంధనలు తుంగలో తొక్కి మట్టిని తెగనమ్ముకుని అదనంగా సంపాదించుకున్నారు. నాగులుప్పలపాడు మండలం ఉప్పుగుండూరులో మాజీ సైనికోద్యోగి నార్నె శ్రీనివాసరావుకు 2006లో ప్రభుత్వం ఇచ్చిన 3.60 ఎకరాల భూమిలో నీరు–చెట్టు కింద చెరువు మట్టి తవ్వేశారు. గ్రామానికి చెందిన ఓ టీడీపీ నాయకుడు ఆ పనికి రూ.10 లక్షలు బిల్లు పెట్టి.. అందులో వచ్చిన మట్టి అమ్ముకుని మరో రూ.10 లక్షలు సంపాదించాడు. ఇదే తరహాలో నియోజకవర్గంలో నీరు–చెట్టు పనుల్లో దోపిడీ సాగింది. విజయ్‌కుమార్ అండదండలతో వారు మరింతగా రెచ్చిపోయారన్న ఆరోపణలు ఉన్నాయి.

జన్మభూమి కమిటీల పేరుతో సంక్షేమానికి కత్తెర

టీడీపీ జమానాలో రాజకీయ నిరుద్యోగులైన కార్యకర్తలకు పదవులు కట్టబెట్టాలనే ఉద్దేశంతో అధికారికంగా ప్రొటోకాల్ కల్పిస్తూ తీసుకొచ్చిన జన్మభూమి కమిటీలు ప్రజలకు చుక్కలు చూపించాయి. ప్రభుత్వ ఇళ్లు, పింఛన్లు, పేదలకు ఇచ్చే రుణాలు, గృహాల మంజూరులో లబ్ధిదారులు టీడీపీకి చెందిన వారేనా..? కాదా..? అని ఆరా తీస్తూ, కులాల వారీగా ఎంపిక చేశారు. ప్రతిపక్ష పార్టీలకు చెందిన వారితోపాటు సామాన్యులకు పథకాలు దక్కకుండా జన్మభూమి కమిటీలు చూపిన వివక్ష అంతా ఇంతా కాదు.

ప్రొటోకాల్‌కు తూట్లు

గతంలో ఎప్పుడూ లేని విధంగా చంద్రబాబునాయుడు 2014–19లో రాజకీయ కుసంస్కారానికి తెరతీశాడు. ఎమ్మెల్యేలను పూచికపుల్లలా పక్కన పెట్టి ఓడిన టీడీపీ అభ్యర్థులకు పవర్స్ కట్టబెట్టేశారు. ఇలాంటి దారుణమైన ప్రొటోకాల్ సిస్టం గతంలో ఎప్పుడూ లేదు. 2014 ఎన్నికల్లో సంతనూతలపాడు ఎమ్మెల్యేగా వైఎస్సార్ సీపీ నుంచి ఆదిమూలపు సురేష్ గెలుపొందినా.. టీడీపీ తరఫున పోటీ చేసి ఓడిన బీఎస్ విజయకుమార్‌కు పెత్తనం అప్పగించారు. అప్పట్లో పోలీసులు విజయకుమార్‌కు సెల్యూట్ చేస్తూ స్వాగతం పలికిన దృశ్యాలు చూసిన వారంతా మనం ప్రజాస్వామ్యంలో ఉన్నామా? లేక నియంతృత్వ దేశంలో ఉన్నామా? అనే ముక్కున వేలేసుకున్నారు. రామతీర్థం రిజర్వాయర్ వద్ద సాగర్ జలాలను వదిలే సమయంలో ఎమ్మెల్యే ఆదిమూలపు సురేష్‌కు సమాచారం ఇవ్వకపోగా, విషయం తెలుసుకుని అక్కడకు చేరుకున్న ఎమ్మెల్యేను కట్ట నుంచి వెనక్కి నెట్టేసిన బీఎస్.విజయకుమార్, దామచర్ల జనార్దన్ తీరు రాజకీయంగా సంచలనంగా మారింది. టీడీపీ నేతల దుందుడుకు చర్యలపై ప్రివిలేజ్ కమిటీకి ఫిర్యాదు చేసిన సురేష్, అసెంబ్లీలోనూ ఎండగట్టారు.

సర్పంచ్‌లపై వేధింపులు

స్థానిక సంస్థల ఎన్నికల్లో సర్పంచ్‌లుగా గెలుపొందిన వైఎస్సార్ సీపీ సానుభూతిపరుల చెక్ పవర్‌ను రద్దు చేయించడం, ఆయా గ్రామాల్లో అభివృద్ధి పనులకు ఏమాత్రం సహకరించకుండా టీడీపీ నాయకులు అడ్డుకున్న సంఘటనలు నేటికీ సజీవంగానే ఉన్నాయి. చీమకుర్తి మండలంలోని గాడిపర్తివారిపాలెం సర్పంచ్ సూడిదేల సుబ్బరామిరెడ్డి, ఎర్రగుడిపాడు సర్పంచ్ గంగిరేకుల వెంకట్రావు చెక్‌పవర్‌ను రద్దు చేయించి ఇష్టారాజ్యంగా వ్యవహరించారు.



కనపర్తి వద్ద ప్రభుత్వ భూమిలో టీడీపీ నేతలు అక్రమంగా ఏర్పాటు చేసిన రొయ్యల చెరువులు (ఫైల్)

ఇంటింటికీ మేలు చేశాం...ఆశీర్వదించండి



రోడ్‌షోలో అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి బాలినేని శ్రీనివాసరెడ్డి

- జగనన్న పాలనలో ప్రతి ఇంటికీ మేలు
- ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి



డివిజన్‌లు బలరాంకాలనీలో బాలినేని రోడ్‌షోలో పాల్గొన్న ప్రజలు

ఒంగోలు టౌన్: రాష్ట్రంలో ప్రతి ఒక్కరికీ మేలు చేయాలన్న ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తుంటే సహించలేని చంద్రబాబు అడ్డంకులు సృష్టించి నిరుపేద ప్రజలను ఇబ్బందులపాలు చేస్తున్నారని ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి అన్నారు. 2014 ఎన్నికల్లో 600 హామీలు ఇచ్చిన చంద్రబాబు ఎన్నికల్లో గెలిచిన తరువాత కనీసం ఒక్క హామీని కూడా అమలు చేయలేదని, ఇప్పుడు సూపర్ సిక్స్ పేరుతో టీడీపీ విడుదల చేసిన మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను ప్రజలు నమ్మడం లేదని చెప్పారు. మంగళవారం ఉదయం 3, 5వ డివిజన్లో ఆయన ప్రచారం నిర్వహించారు. మిలిటరీ కాలనీ నుంచి బలరాం కాలనీ, పొనుగుపాటి కాలనీ, ఎన్టీఆర్ కాలనీ, భరత్ కాలనీలలో రోడ్ షో నిర్వహించారు. 5వ డివిజన్‌లో అగ్నిలియం స్కూలు నుంచి 4వ లైను ఎక్స్‌టన్షన్ వరకు నిర్వహించిన రోడ్ షోలో పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. బాలినేని మాట్లాడుతూ నగరంలో 25 వేల మందికి ఇళ్ల స్థలాల పట్టాలు పంపిణీ చేశామని, వచ్చే 9 నెలల్లో ప్రతి ఒక్కరికీ ఇళ్లు నిర్మించి ఇస్తామన్నారు. ఇస్లాంపేటలో చిన్న వర్షం కురిసినా రోడ్ల మీదకు నీరు చేరేదని, మురికి నీరు కూడా చేరి ప్రజలు నానా ఇబ్బందులు పడేవారని, కోటి రూపాయలతో డ్రైనేజీ కాలువ నిర్మించడంతో సమస్య పరిష్కారమైందన్నారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజి నిర్మించి ఒంగోలు నగరం మొత్తం మురుగు నీటి సమస్యను పరిష్కరిస్తామన్నారు. వైఎస్సార్ సీపీ ఒంగోలు ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు, ఎంపీ అభ్యర్థిగా చెవిరెడ్డి భాస్కరరెడ్డికి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. ప్రచారంలో 3వ డివిజన్ కార్పొరేటర్ గందు ధనలక్ష్మి మధు, 5వ డివిజన్ కార్పొరేటర్ పద్మావతి రంగారావు, డివిజన్ అధ్యక్షుడు షేక్ జాఫర్, సత్యనారాయణ రెడ్డి, బొంతా గంగాధర్, మోహన్ రావు, వెంకటరావు, చాపలనాగరాజు, శ్రీకాంత్, తంబి, శ్రీనురెడ్డి, షేక్ సుభాని, రమిజా, జ్యోతి, సుభాని, పేదిరెడ్డి , బాలమ్మ, బాలలక్ష్మి, మైనారిటీ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ జలీల్, షాజహాన్ పాల్గొన్నారు.

బాపూజీ కాంప్లెక్స్‌లో అడుగడుగునా బ్రహ్మరథం: బాపూజీ కాంప్లెక్స్‌లో బాలినేని నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో వ్యాపారులు అడుగడుగునా బ్రహ్మరథం పట్టారు. బాలినేని ప్రతి ఒక్కరినీ పేరుపేరునా పలకరిస్తూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్, నగర మేయర్ గంగాడ, డిప్యూటీ మేయర్ వేమూరి సూర్యనారాయణ, పార్టీ నగర అధ్యక్షుడు కఠారి శంకర్, గొర్రెపాటి శ్రీనివాసరావు, బాపూజీ కాంప్లెక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కోడూరి సత్యనారాయణ, నాయకులు ఎస్ఆర్ శ్రీనివాసరావు, కే ప్రభాకరరావు, ఇ.సత్య శ్రీనివాసులు, బీ వరదరాజమ్, షౌకత్ అలి, బాషా, ఒంగోలు బుజ్జి, తాతా బదరి పాల్గొన్నారు.

మీలో ఒకడినై ఉంటా...ఆదరించండి



తేటుపురంలో పర్యటిస్తున్న మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్



వెలగపూడిలో మంత్రి ఆదిమూలపు సురేష్ ప్రచారానికి తరలివచ్చిన ప్రజలు

- మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్

టంగుటూరు: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లు వేసి ఎంపీగా చెవిరెడ్డి భాస్కరరెడ్డిని, ఎమ్మెల్యేగా తనను అత్యధిక మెజారిటీతో గెలిపిస్తే మీ ఒకడిగా అందరికీ అందుబాటులో ఉండి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని మంత్రి, వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. మండలంలోని అనంతవరం పంచాయతీ పరిధి తేటుపురం, తాళ్లపాలెం, పసుముద్ర, వెలగపూడి గ్రామాల్లో పల్లె పల్లెకు సిద్ధం కార్యక్రమంలో మంత్రి మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సురేష్ మాట్లాడుతూ టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీల పేరుతో ప్రజలకు అందాల్సిన సంక్షేమ లబ్ధిని దోచేశారన్నారు. సీఎం జగన్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నవరత్నాల్లో చేర్చి అర్హత గలిగిన ప్రతి ఒక్కరికీ సచివాలయ, వలంటీర్ల వ్యవస్థ ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించారన్నారు. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా పాలన అందిస్తుంటే కూటమి నేతలు ప్రభుత్వంపై బురదజల్లుతున్నారన్నారు.

వైఎస్సార్ సీపీ క్యాడర్‌లో ఉత్సాహం:

ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ ఆదిమూలపు సురేష్ ప్రచారం విజయపథం వైపు దూసుకెళ్తోంది. కొన్ని నెలల ముందు మాత్రమే నియోజకవర్గ బాధ్యతలు చేపట్టినప్పటికీ తక్కువ సమయంలోనే నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో మొత్తం 112 పంచాయతీల్లో ప్రచారాన్ని దాదాపు పూర్తి చేశారు. టంగుటూరు మండలంలోని అనంతవరం పంచాయతీలోని తేటుపురంలో యువకులు ఉత్సాహంతో 250 ద్విచక్ర వాహనాలతో ర్యాలీ నిర్వహించారు. అడుగడుగునా పూల వర్షం కురిపిస్తూ మన నేత జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకోవటానికి మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ గెలిపించుకుంటామని నినాదాలు చేశారు. మహిళలు హారతులు పట్టారు. నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీకి బలమైన ఓటింగ్ ఉన్నా నాయకుల మధ్య గ్రూపుల బెడదతో 2014, 2019 ఎన్నికల్లో ఓటమిపాలయ్యామని, ఈ సారి ఆ తప్పిదం జరగనివ్వకుండా చూస్తామని నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో ముందుకు కదలాలన్నారు. మనమంతా ఒకే వర్గం.. అది జగనన్న వర్గమని అందరం ఏకతాటిపై ఉండి కొండపి నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ జెండా ఎగరవేయాలన్నారు.

కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు చింతపల్లి హరిబాబు, పార్టీ మండల అధ్యక్షుడు మల్లవరపు రాఘవరెడ్డి, జెడ్పీటీసీ మన్నం అరుణకుమారి, పార్టీ నాయకుడు ఏవీఎస్ రాజు, సర్పంచ్ ఉప్పలపాటి శివరామరాజు, ఎంపీటీసీ కసుకుర్తి కోటేశ్వరరావు, సొసైటీ డైరెక్టర్ ఉప్పలపాటి నాగరాజు, ఉప్పలపాటి సుబ్బరాజు, శారీమందిర్ వెంకటేశ్వర్లు, మర్రి భాస్కరరెడ్డి, రాజు వేణుగోపాలరెడ్డి, రాజు నాగరెడ్డి, మంత్రి శ్రీనివాసరెడ్డి, జిల్లా చంద్ర, మిడసల సుబ్బారావు, కసుకుర్తి రమేష్, కన్నా వెంకట్రావు, కన్నా శ్రీను, తమ్మినేని లక్ష్మి నరసింహ స్వామి, మెండా శ్రీను, గుంతోటి శ్రీను, బొడపాటి రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు సర్వం సిద్ధం

- పోలింగ్‌కు పటిష్టమైన ఏర్పాట్లు
- ఈవీఎం కమిషన్ పూర్తి చేశాం, 80 శాతం ఓటరు స్లిప్‌లు పంపిణీ
- ఎన్నికల నిబంధనల ఉల్లంఘన జరగకుండా పక్కా నిఘా
- ఇళ్ల పట్టాలపై దుష్ప్రచారం చేస్తే కఠిన చర్యలు
- విలేకర్ల సమావేశంలో కలెక్టర్ దినేష్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్, పక్కన ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్

ఒంగోలు అర్బన్: సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు జిల్లాలో అన్నీ ఏర్పాట్లు పూర్తి చేసి సిద్ధం చేశామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ తెలిపారు. మంగళవారం ప్రకాశం భవనంలోని కంట్రోలు రూములో ఎన్నికల నిర్వహణపై విలేకర్ల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. ఈ నెల 13వ తేదీ జరిగే పోలింగ్ ప్రక్రియకు సంబంధించి పటిష్టమైన భద్రతతో ముందస్తు ఏర్పాట్లు చేశామన్నారు. ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గంతో పాటు జిల్లాలోని 8 అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి ఈవీఎం కమిషన్ ప్రక్రియ కూడా మంగళవారంతో పూర్తి చేశారన్నారు. ఇప్పటి వరకు 80 శాతం ఓటరు స్లిప్‌లు పంపిణీ చేశామన్నారు. జిల్లాలో మొత్తం 18,22,470 మంది ఓటర్లు ఉండగా 14,46,495 మందికి ఓటరు స్లిప్‌లు పంపిణీ చేసినట్లు తెలిపారు. మరో రెండు రోజుల్లో నూరు శాతం పూర్తి చేస్తామన్నారు. 8 నియోజకవర్గాల్లో హోమ్ ఓటింగ్‌తో కలిపి మొత్తం 22,132 పోస్టల్ బ్యాలెట్‌లలో ఈ నెల 6వ తేదీ నాటికి 16,215 మంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకున్నారన్నారు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోలు రూములో 08592–288599 నంబర్‌ను ఏర్పాటు చేశామని తెలిపారు. సీ–విజిల్ ద్వారా వచ్చిన ఫిర్యాదులపై సమగ్రంగా విచారణ చేసి నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ నెల 12వ తేదీ జిల్లాలోని నియోజకవర్గ డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల నుంచి సంబంధిత పోలింగ్ కేంద్రాలకు పోలింగ్ పార్టీలను పంపేందుకు అవసరమైన 486 వాహనాలను సిద్ధం చేశామన్నారు. పోలింగ్ సిబ్బంది బస చేసేందుకు అన్నీ ఏర్పాట్లు చేశామని తెలిపారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినప్పటి నుంచి రూ.3.83 కోట్ల విలువైన సరుకును సీజ్ చేశామన్నారు. ఎంసీసీ వైలేషన్ కింద 67 కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

ఇళ్ల పట్టాలు దొంగ పట్టాలని ప్రచారం చేస్తే చర్యలు: పేదలకు ప్రభుత్వం ఇచ్చిన పట్టాలను దొంగ పట్టాలని అసత్య ప్రచారాలు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. విలేకర్లు అడిగిన ప్రశ్నకు సమాధానం ఇస్తూ ప్రభుత్వం పట్టాలు ఇచ్చిందంటే ఒక అథంటికేషన్‌తో ఇళ్ల పట్టాలు ఇస్తుందన్నారు. ఏవైనా సందేహాలు ఉంటే ఈసీ చూసుకోవచ్చన్నారు. ఇళ్ల పట్టాలపై వచ్చిన అసత్య ప్రచారాలపై వచ్చిన ఫిర్యాదులపై విచారించి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. పట్టాల రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన వివరాలన్నీ సక్రమంగా ఉన్నాయన్నారు.

ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్ మాట్లాడుతూ జిల్లాలో ఎన్నికల నిర్వహణ ప్రక్రియలో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. కీలక పోలింగ్ కేంద్రాల వద్ద పోలీసులు, కేంద్ర బలగాలతో అదనపు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. 263 రూట్ మొబైల్, 56 క్విక్ రెస్పాన్స్ బృందాలు, 22 స్ట్రైకింగ్ ఫోర్స్‌లో ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారులు, 9 స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్ బృందాలు పనిచేస్తాయన్నారు.

వీటితో పాటు సీఆర్‌పీఎఫ్, బీఎస్ఎఫ్, తమిళనాడు పోలీసులు, స్థానిక పోలీసులతో మరికొన్ని బృందాలను ఏర్పాటు చేశామన్నారు. ఎవరైనా ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించి శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. దీనిలో డీఆర్ఓ శ్రీలత, కమాండ్ కంట్రోలు రూము నోడల్ అధికారి వరకుమార్, ఏఓ శ్రీకాంత్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీకే మైనార్టీల మద్దతు

● రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ మీర్జా సంషీర్ ఆలీ బేగ్


మీడియాతో మాట్లాడుతున్న రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ మీర్జా సంషీర్ ఆలీ బేగ్

ఒంగోలు: మైనార్టీల సంక్షేమానికి, అభివృద్ధికి అండగా ఉంటున్న వైఎస్సార్ సీపీకే మైనార్టీల మద్దతు అని రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ మీర్జా షంషీర్ ఆలీ బేగ్ పేర్కొన్నారు. స్థానిక హజ్ కమిటీ డైరెక్టర్ బాషాతో కలిసి నగరంలో మంగళవారం ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో మైనార్టీలకు అగ్రతాంబూలం దక్కిందన్నారు. నామినేటెడ్ పదవుల్లో 50శాతం పదవులు అట్టడుగు వర్గాల వారివే అన్నారు. మైనార్టీలకు 13 కార్పొరేషన్ చైర్మన్లు, నాలుగు ఎమ్మెల్సీలు ఇప్పటికే కేటాయించడంతో పాటు తాజాగా జరగనున్న ఎన్నికల్లో 7 ఎంఎల్ఏ స్థానాలను మైనార్టీలకు కేటాయించారన్నారు. మైనార్టీల జీవన ప్రమాణాల పెంపుకు, రాజకీయంగా ఉన్నత స్థాయిని కల్పించిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. ఏ రాష్ట్రంలో జరగని అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ఒక్క మన రాష్ట్రంలోనే జరుగుతున్నాయన్నారు. దీనికంతటికి కారణం ముఖ్యమంత్రి జగనకు పేదలపై ఉన్న అభిమానం మాత్రమే అన్నారు. ఇంతటి భాగ్యాన్ని మాకు కల్పించిన వైఎస్సార్ సీపీకి కృతజ్ఞతలు తెలిపేందుకు ప్రతి ఒక్క మైనార్టీ ఈ నెల 13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ఒంగోలు ఎమ్మెల్యే అభ్యర్థిగా బాలినేని శ్రీనివాసరెడ్డికి, ఎంపీ అభ్యర్థిగా చెవిరెడ్డి భాస్కరరెడ్డిలను గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. వైఎస్ రాజశేఖరరెడ్డి నాలుగు శాతం రిజర్వేషన్లు కల్పించడం వల్లే నేడు వేలాది మంది మైనార్టీ యువత ఉద్యోగావకాశాలను అందిపుచ్చుకుని జీవన ప్రమాణాలు పెంచుకున్నారనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గమనించాలని రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ మీర్జా షంషీర్ ఆలీ బేగ్ గుర్తు చేశారు.

వడ్డెరల మద్దతు వైఎస్సార్ సీపీకే

● వడ్డెర సంఘం జాతీయ అధ్యక్షుడు తన్నీరు ధర్మరాజు


వడ్డెరల సంఘ సమావేశంలో కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న వడ్డెర సంఘ నేతలు

దర్శి: వడ్డెరుల మద్దతు వైఎస్సార్ సీపీకేనని సంఘం జాతీయ అధ్యక్షుడు తన్నీరు ధర్మరాజు పేర్కొన్నారు. స్థానికంగా మంగళవారం జరిగిన వడ్డెరల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. 2004లో వైఎస్సార్ సీఎం అయిన వడ్డెరులను ఎన్నో ఉన్నత పదవులు కేటాయించారన్నారు. వడ్డెరలకు ఫైనాన్స్ ఫెడరేషన్, ఎమ్మెల్యే సీటు, హస్తకళ చైర్మన్, నాలుగు మున్సిపల్ చైర్మన్లు, స్థానిక సంస్థల్లో అవకాశాలు కల్పించారన్నారు. వడ్డెరల సామాజిక స్థితి, జీవన విధానాలను గమనించిన వైఎస్సార్..ఎస్టీ జాబితాలో చేర్చేందుకు కేబినెటిలో తీర్మానం చేసి కేంద్రానికి పంపించారన్నారు. ఆ తరువాత వచ్చిన ప్రభుత్వాలు పట్టించుకోలేదన్నారు. ప్రస్తుతం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడిడ్ వడ్డెరులకు ఎమ్మెల్సీ సీటు, మిర్చి యార్డు చైర్మన్‌గా రెండు పర్యాయాలు చేశారన్నారు. 14 ఏళ్లు సీఎంగా ఉన్న చంద్రబాబునాయుడు రాజకీయంగా వడ్డెరలకు ఎలాంటి పదవులు ఇవ్వలేదన్నారు. 2014లో మాచర్ల స్థానానికి నామినేషన్ వేసుకోమని హామీ ఇచ్చి మోసం చేశాడన్నారు. ఇప్పుడు కూడా పుటపర్తి అసెంబ్లీ, హిందూపురం ఎంపీ స్థానాలు కేటాయిస్తామని చెప్పి చివరకు మోసం చేశాడని విమర్శించారు. వడ్డెరలను ఆదరిస్తున్న వైఎస్సార్‌సీపీకి మద్దతు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో వడ్డెర కార్పొరేషన్ డైరెకటర్లు మల్లె విమల, రామకృష్ణ, యనమల మాధవి, చందవరం ఎంపీటీసీ రాజు, వడ్డెర సంఘం నాయకులు చల్లా నారాయణరాజు, దేవండ్ల తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

పేదలపై ఎందుకీ కక్ష

● వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి

ఒంగోలు: అమలులో ఉన్న సంక్షేమ పథకాలను చంద్రబాబు డైరెక్షన్‌లో ఎలక్షన్ కమిషన్ అడ్డుకోవడం పేదలపై కక్షకట్టడమేనని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి అన్నారు. శనివారం ఆయన మీడియాతో ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రస్తుతం ఏపీలో ఈసీ నుంచి వస్తున్న అభ్యంతరాలను పరిశీలిస్తే ఎన్నికల కమిషనా లేక బాబు కమిషనా అన్నట్లుగా ఉందన్నారు. రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ, రాయితీపై విత్తనాల సరఫరా, జగనన్న విద్యాదీవెన వంటి ఆన్‌గోయింగ్ స్కీములకు నిధులు జమచేయవద్దని ఆదేశించడం ఎంతవరకు సబబు అన్నారు. ఆన్‌గోయింగ్ స్కీములపై చంద్రబాబు అభ్యంతరం వ్యక్తం చేయడం ఈసీ ఆదేశాలు ఇవ్వడం ద్వారా చంద్రబాబు కుట్రలో ఈసీ ఆయుధంగా మారినట్లుగా ఉందన్నారు. ఇటీవల చంద్రబాబు అండ్ కో చేసిన ఫిర్యాదు కారణంగా సామాజిక పెన్షన్ల పంపిణీని వలంటీర్ల ద్వారా ఇవ్వడానికి వీల్లేదంటూ విధించిన నిబంధనతో 70 మంది మృత్యువాత పడ్డారన్నారు. రైతులకు సకాలంలో ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వకపోతే రైతులు పంటలు ఎలా వేసుకుంటారని ప్రశ్నించారు. ఎన్నికల కమిషన్ రాష్ట్రానికో రకంగా నిబంధనలు విధించడం సరికాదని, తక్షణమే ఈసీ చంద్రబాబుకు వత్తాసు పలకడం మానుకుని తమ నిర్ణయాన్ని పునఃసమీక్షించుకోవాలని కోరారు.

నాన్న ఆశయమే నాకు ఆదర్శం

● ఆదరించండి..అండగా ఉంటాం
● మానవత్వం లేని మనిషి చంద్రబాబు
● వైఎస్సార్ సీపీ దర్శి ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి


ఇంటింటి ప్రచారంలో బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి


హాజరైన స్థానికులు

దర్శి: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి అడుగుజాడల్లో నడిచిన తన తండ్రి బూచేపల్లి సుబ్బారెడ్డి ఆశయసాధనే తన ధ్యేయమని వైఎస్సార్ సీపీ దర్శి ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి అన్నారు. మండలంలోని కొర్లమడుగు, కృష్ణాపురం గ్రామాల్లో మన ఊరు మనశివన్న కార్యక్రమం మంగళవారం ఘనంగా నిర్వహించారు. కొత్తపల్లి నుంచి కొర్లమడుగు మీదుగా కృష్ణాపురం వరకు మోటారు సైకిల్‌ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ 20 ఏళ్లుగా దర్శి నియోజకవర్గంలో సేవలందిస్తున్నామన్నారు. నేను, అమ్మ కూడా నాన్న బాటలోనే నడుస్తున్నామని చెప్పారు. నాన్న నన్ను ఎంబీబీఎస్ చదివించి ప్రజలకు సేవలందించాలని కోరారని, రాజకీయాల్లోకి వస్తే మరింత సేవ చేసే భాగ్యం కలుగుతుందని నాన్న కోరిక మేరకు ఆయన ఆశయాలను నిజం చేసేందుకు దర్శి నియోజకవర్గాన్ని ఎంచుకున్నామన్నారు. మీరంతా ఆదరించండి మీకు అండగా ఉంటానని విజ్ఞప్తి చేశారు. పింఛన్ తీసుకునే వృద్ధులపై కక్ష కట్టే మానవత్వం లేని మనిషి రాష్ట్రంలో ఎవరైనా ఉన్నారా అంటే ఒక్క చంద్రబాబు మాత్రమే అన్నారు. ఇలాంటి దుర్మార్గాలకు పాల్పడ్డ వ్యక్తికి ఎవరైనా మద్దతు తెలుపుతారా అని ప్రశ్నించారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీలకతీతంగా సంక్షేమం, అభివృద్ధి ఫలాలు అందించారన్నారు. అందుకే మీకు మేలు జరిగితే ఓటేయండని ధైర్యంగా అడుతున్నారన్నారు. చంద్రబాబు 2014లో అధికారంలోకి వచ్చే ముందు 600 పైగా హామీలు ఇచ్చి ఒక్కటీ అమలు చేయలేదన్నారు. ప్రతి కార్యకర్త ఎన్నికల్లో కష్టపడి పనిచేసి ప్రజలకు అండగా నిలవాలన్నారు. ఎంపీపీ సుధా అచ్చయ్య, సర్పంచ్ బత్తుల సుబ్బలక్ష్మీ సుబ్బారెడ్డి, కొత్తపల్లి సర్పంచ్ బట్టు రాము, అంకాలశ్రీను, వనం విజయ్, మురళీ, వైఎస్సార్ సీపీ యూత్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి పాకనాటి మహానందరెడ్డి, దోర్నాల కోటిరెడ్డి, బత్తుల వెంకటేశ్వరరెడ్డి, సాదం ఆది నారాయణ, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు కేసరి రాం భూపాల్‌రెడ్డి, ఎంపీటీసీల సంఘ అధ్యక్షుడు బండి గోపాల్‌రెడ్డి, ఉపసర్పంచ్ కనపర్తి రోశయ్య, ఎంపీటీసీ సూరంపల్లి జ్యోతి, వెంకటేశ్వర్లు, ఇల్లూరి సుబ్బారెడ్డి, పందిళ్ల శ్రీను, వెంకట్రావు పాల్గొన్నారు.

బాలినేనికి బ్రహ్మరథం


గాంధీరోడ్డు ఎన్నికల ప్రచారంలో బాలినేనిని గజమాల, వెండి కిరీటంతో సత్కరిస్తున్న ఆర్యవైశ్యులు

ఒంగోలు: ఎన్నికల ప్రచారంలో భాగంగా నగరంలోని 22, 25, 26 డివిజన్లలో ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా గాంధీరోడ్డు బాలినేనికి బ్రహ్మరథం పట్టారు. కోర్టుసెంటర్‌లో భారీ గజమాలతో స్వాగతం పలికారు. వ్యాపారులు వెండి కిరీటం అలంకరించారు. ఈ సందర్భంగా పలువురు వ్యాపారులు మాట్లాడుతూ బాలినేని అందరివాడన్నారు. ఆర్యవైశ్యులకు ఏదైనా సమస్య ఉందంటే తప్పకుండా ఆదుకునే మనస్తత్వం బాలినేనిదన్నారు. ఇటీవల బాపూజీ కాంప్లెక్స్‌లో షాపు దగ్ధమైతే వ్యక్తిగతంగా ఆదుకున్న బాలినేని వంటి మనసు అందరిలో చూడలేమన్నారు. కరోనా సమయంలో ఆర్యవైశ్యులకు వాసన్న ఎంతో అండగా నిలిచారని కొనియాడారు. ఆర్యవైశ్యుల ఆరామక్షేత్రానికి స్థలం కేటాయించడంలోను, బాపూజీ గో సంరక్షణశాల సమస్యను పరిష్కరించారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా బాలినేని మాట్లాడుతూ ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలవడంలో మీరు చూపిన సహకారం మరువలేనిదన్నారు. తాను చివరిసారిగా పోటీచేస్తున్న ఎన్నికల్లో తనకు మరోమారు అవకాశం కల్పించాలన్నారు. ఇటీవల ఇళ్ల పట్టాల పంపిణీలోనూ ఈ మూడు డివిజన్లకు చెందిన ఆర్యవైశ్యులు, బీసీలు, కాపులు, ముస్లింలకు కూడా అందించామన్నారు. ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్, నగర మేయర్‌గంగాడ సుజాత, డిప్యూటీ మేయర్ వేమూరి సూర్యనారాయణ, నగర అధ్యక్షుడు కటారి శంకర్, ఒంగోలు సూపర్‌బజార్ చైర్మన్ తాతా బదరీనాథ్, దాసరి నారాయణరావు, దాసరి సుబ్రహ్మణ్యం, పట్నం మధుసూదనాచారి, త్రిపురం మల్లికార్జునరావు, తిరుపతిరెడ్డి, తుల్లి శివ, అయ్యప్ప, సుజాత, తిరుపతి, డివిజన్ అధ్యక్షులు గంటా అంజి, అజయ్, చలం, 26వ డివిజన్ అధ్యక్షుడు జాజుల కృష్ణ, మాతాశిశు వైద్యశాల డైరెక్టర్ సాధం విజయలక్ష్మి, డివిజన్ ఇన్‌చార్జి కటారి ప్రసాద్, వేమూరి శ్రీనివాసులు, కో ఆర్డినేటర్ మనోజ్‌కుమార్, అమరాశ్రీను, బాపూజీ కాంప్లెక్స్ చైర్మన్ కోడూరి సత్యం, గొర్రెపాటి శ్రీనివాసరావు, 22వ డివిజన్ కార్పొరేటర్ కారంశెట్టి రామపుష్పలత, మాజీ కౌన్సిలర్ కోడూరి సుధారాణి కిషోర్, గుర్రం బదరీనాథ్, బియ్యపు విజయ్, పచ్చిపులుసు శ్రీనివాసరావు, తమ్మన ఆంజనేయులు, మునగా కృష్ణారావు, నల్లమల్లి కుమార్, నల్లమల్లి అనీల్, వాయగల శ్రీను, కొణిజేటి శ్రీను, తాతా శ్రీనివాసులు, తాళ్లూరి లక్ష్మీనారాయణ, అన్నంకోట శ్రీను, ఏల్చూరి రాఘవ, ఏల్చూరి రవి, మాజీ కౌన్సిలర్ జ్వాలాపతి దామరాజు క్రాంతికుమార్, బాబు, ఈమని మధు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రక్రియలో అప్రమత్తంగా ఉండండి


సిబ్బందికి సూచనలు కలెక్టర్ దినేష్‌కుమార్

మార్కాపురం: ఎన్నికల ప్రక్రియలో పాల్గొనే సిబ్బంది, అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ దినేష్‌కుమార్ చెప్పారు. మంగళవారం ఆయన మార్కాపురం పట్టణంలో పర్యటించారు. ఎస్వీకేపీ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమును, ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్స్ భద్రపరిచిన తీరును, భద్రతా ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. కల్పిస్తున్న భద్రతా ఏర్పట్లపై సబ్ కలెక్టర్ రాహుల్‌మీనా, డీఎస్పీ బాలసుందరరావుతో మాట్లాడారు. భద్రతా పరమైన లోపాలు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రాత్రి సమయాల్లో లైటింగ్, పోలింగ్ రోజు సాయంత్రం ఏర్పాటు చేయాల్సిన బారికేడ్ల ఏర్పాటు తదితర అంశాలపై ఆర్ఓ రాహుల్‌మీనాకు సూచనలు చేశారు.

పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ పరిశీలన:
అనంతరం ఆయన స్థానిక జెడ్పీ బాలుర పాఠశాలలో జరుగుతున్న పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించారు. పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన సదుపాయాలు, మౌలిక వసతులు, పోలింగ్ ప్రక్రియను పరిశీలించారు. పోలింగ్ విధుల్లో పాల్గొనే ఉద్యోగులందరూ వారికి కల్పించిన పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ సదుపాయాన్ని వినియోగించుకోవాలన్నారు. పోస్టల్ బ్యాలెట్ ఓటు కోసం ఒక ఉద్యోగికి యూపీఐ విధానంలో ఒకరు డబ్బులు పంపినట్లు వచ్చిన వార్తలపై కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా ప్రతి ఉద్యోగి తమ ఓటును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని సూచించారు.

పోలింగ్ కేంద్రాల తనిఖీ:
మార్కాపురం మండలంలోని పెద్దనాగులవరం ఎంపీపీ పాఠశాల, నికరంపల్లి, జమ్మనపల్లి, కోలభీమునిపాడు ఎంపీపీ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను రిటర్నింగ్ అధికారి రాహుల్‌మీనాతో కలిసి కలెక్టర్ దినేష్ కుమార్ పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేయాల్సిన మౌలిక సదుపాయాలపై పలు సూచనలు చేశారు. కలెక్టర్ వెంట తహశీల్దార్ రవికుమార్, సెక్టార్ ఆఫీసర్ డీ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

సంక్షేమ పథకాలు వైఎస్సార్ సీపీకే సాధ్యం

● ఎన్నికల ప్రచారంలో మంత్రి మేరుగు నాగార్జున


ప్రచారంలో మాట్లాడుతున్న మంత్రి మేరుగు నాగార్జున

సంతనూతలపాడు(చీమకుర్తి): వైఎస్సార్ సీపీ మళ్లీ అధికారంలోకి వస్తేనే సంక్షేమ పథకాలు అందుతాయని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి, సంతనూతలపాడు ఎమ్మెల్యే అభ్యర్థి మేరుగు నాగార్జున అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం మండలంలోని మంగమూరు, గుమ్మనంపాడు, ఎనికపాడు, బొడ్డువారిపాలెం, తక్కెళ్లపాడు, చిలకపాడు, మద్దూలూరు గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్ల వైఎస్సార్ సీపీ పాలనలో అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా పథకాలు అమలు చేశారన్నారు. చంద్రబాబు మరోసారి మోసపూరిత వాగ్దానాలతో ముందుకు వస్తున్నారని, ఆ వాగ్దానాలను ఎవ్వరూ నమ్మవద్దన్నారు. జగనన్న ఇచ్చిన హామీల్లో 99 శాతం హామీలు అమలు చేశారని కొనియాడారు. ఈ నెల 13న జరగనున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటేసి నన్ను, ఎంపీ అభ్యర్థి నందిగం సురేష్‌ను గెలిపించాలని కోరారు. తొలుత మంగమూరు నాయకుడు అబ్బూరి శంకరరావు ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. అనంతరం గుమ్మలంపాడులో పర్యటించారు. సొసైటీ అధ్యక్షుడు బొక్కిసం శివరామయ్య ఆధ్వర్యంలో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా జనసేన నుంచి 10 మంది మంత్రి సమక్షంలో పార్టీలో చేరారు. మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి, జెడ్పీటీసీ దుంపా రమణమ్మ, ఎంపీపీ విజయ, అబ్బూరి శంకర్రావు, సొసైటీ ప్రెసిడెంట్ దుంపా యలమందారెడ్డి, సీనియర్ నాయకులు బొల్లినేని కృష్ణయ్య, బొక్కిసం శివరామయ్య, తలారి కోటయ్య, సర్పంచ్ తలారి వెంకట్రావు, సర్పంచ్ ఆలూరు సుశీల, మద్దులూరు సర్పంచ్ శైలజ, అమరనాథ్ పాల్గొన్నారు.

చంద్రబాబు బూటకపు హామీలు నమ్మొద్దు


ఓట్లు అభ్యర్థిస్తున్న అన్నా రాంబాబు

● వైఎస్సార్ సీపీ మార్కాపురం అభ్యర్థి అన్నా రాంబాబు


పొదిలి: చంద్రబాబు బూటకపు హామీలను నమ్మొద్దని వైఎస్సార్ సీపీ మార్కాపురం అభ్యర్థి అన్నా రాంబాబు అన్నారు. మండలంలోని ఆముదాలపల్లి, తీగదుర్తిపాడు, రాములవీడు, రామాపురం, సూదనగుంట గ్రామాల్లో మంగళవారం ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా అన్నా రాంబాబు మాట్లాడుతూ జగనన్న ప్రవేశపెట్టిన పథకాలతో రైతులకు ఎంతో మేలు జరిగిందన్నారు. పెట్టుబడి సాయం, సున్నా వడ్డీకే రుణాలు, రైతులకు గిట్టుబాటు ధరలు, రైతు భరోసా వంటి పథకాలు రైతులకు అండగా ఉన్నాయన్నారు. ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ పేరుతో టీడీపీ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తోందన్నారు. రాష్ట్రంలో ఒక్క రైతుకైనా యాక్టు వల్ల అన్యాయం జరిగిందా అని ప్రశ్నించారు. ప్రజలకు మేలు చేయడం తప్ప జగనన్నకు మరో ఆలోచన ఉండదన్నారు. 2014లో కల్లబొల్లి హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు అన్ని వర్గాల ప్రజలను నిలువునా మోసం చేశాడన్నారు. రైతు రుణమాఫీ, డ్వాక్రా రుణమాఫీ చేయకపోవడంతో వారు తీవ్రంగా నష్టపోయారన్నారు. ఏపీఐఐసీ చైర్మన్, పార్టీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి మాట్లాడుతూ నీతి నిజాయితీలే పెట్టుబడిగా, పేదల సేవలో తరిస్తున్న అన్నా రాంబాబును, ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కరరెడ్డిలను ఫ్యాన్ గుర్తుపై ఓట్లేసి గెలిపించాలని కోరారు. ప్రచారంలో ఎంపీపీ వాకా వెంకటరెడ్డి, రాష్ట్ర కార్యదర్శులు కేవీ రమణారెడ్డి, సానికొమ్ము శ్రీనివాసరెడ్డి, జిల్లా కార్యదర్శులు జి.చెన్నారెడ్డి. జి.శ్రీనివాసులు, కల్లం సుబ్బారెడ్డి, బ్రహ్మకొండారెడ్డి, నలబోలు వెంకటరెడ్డి, గోపిరెడ్డి మాలకొండారెడ్డి, మద్దిరాల నరసింహారెడ్డి, సర్పంచ్‌లు ఎస్.శ్రీనివాసరావు, కసిరెడ్డి కోటిరెడ్డి, కొత్తపులి బ్రహ్మారెడ్డి, కొత్తపులి అంజిరెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ పొన్నపాటి శ్రీనివాసరెడ్డి, యేటి ప్రసాద్, ఇనగనూరి చెన్నారెడ్డి, ఎద్దు నగేష్, కసిరెడ్డి రమణారెడ్డి పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్ల కొనుగోలు.. ప్రభుత్వ ఉద్యోగిపై కేసు

దర్శి: పోస్టల్ బ్యాలెట్లు కొనుగోలు చేసి యూపీఐ ద్వారా నగదు బదిలీ చేసిన వ్యవహారంలో ఉపాధ్యాయుడు పాణ్యం గోవిందయ్యపై దర్శి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. ఎస్సై సుమన్ వివరాల మేరకు ఫ్లయింగ్ స్క్వాడ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇద్దరు వ్యక్తులు ప్రభుత్వ ఉద్యోగుల పోస్టల్ బ్యాలెట్ ఓట్లను పార్టీలకు అనుకూలంగా వేయించేందుకు యూపీఐ ద్వారా వారి ఖాతాలకు రూ.5 వేల చొప్పున బదిలీ చేశారు. గుత్తా నారాయణ అనే వ్యక్తి ప్రభుత్వ ఉద్యోగుల ఫోన్ నంబర్లు సేకరించి గోవిందయ్యకు ఇచ్చి యూపీఐ ద్వారా రూ.20 వేలు బదిలీ చేశారు. అతను నలుగురికి రూ.5 వేల చొప్పున బదిలీ చేశారు. అలాగే కృష్ణారెడ్డి అనే వ్యక్తి పేరిరెడ్డికి యూపీఐ ద్వారా రూ.55 వేలు ఆరుగురికి రూ.5 వేల చొప్పున బదిలీ చేశారు. పోలింగ్ ప్రక్రియలో పాల్గొనే ప్రభుత్వ ఉద్యోగులకు డబ్బులు వేయడం, ఉద్యోగులు నగదు తీసుకోవడం చట్టరీత్యా నేరం. కేసును సమర్థంగా దర్యాప్తు చేసి ఎవరైనా ఉద్యోగుల ప్రమేయం ఉంటే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు.



అక్రమాలు, అరాచకాలు, వేధింపులు, భూకబ్జాలకు పేటెంట్ హక్కులంటూ జారీ చేస్తే అవి ముందుగా దక్కేది కొండపి నియోజకవర్గ టీడీపీ నాయకులకే. అధికారం చేతిలో ఉందన్న బరితెగింపుతో పచ్చ దండు సాగించిన దౌర్జన్యాలకు నియోజకవర్గంలోని సామాన్య ప్రజలు సమిధలయ్యారు. టీడీపీ ఎమ్మెల్యేగా కొండపిలో రెండో పర్యాయం గెలుపొందిన స్వామి.. చంద్రబాబు సీఎం కాగానే అక్రమాలకు తెరలేపి, వేధింపులకు మరింత పదునుపెట్టారు. దామచర్ల సత్య కనుసన్నల్లో టీడీపీ మూకలు సాగించిన దమనకాండను ఇక్కడి ప్రజలు ఇంకా మరువలేదు.



అధికారమిస్తే.. అరాచకమే..

2014-19 మధ్య అధికారమే అండగా కొండపి నియోజకవర్గంలో పేట్రేగిన పచ్చ దండు

- యథేచ్ఛగా ఎమ్మెల్యే స్వామి, దామచర్ల అక్రమాల దందా
- టీడీపీ మూకల అరాచకాలు, అకృత్యాలకు బలైన సామాన్యులు
- ఖాళీ భూమి కనిపిస్తే కబ్జా.. ఎవరైనా అడ్డు తగిలితే దాడులు
- దళితులపైనే అట్రాసిటీ కేసులు పెట్టించిన టీడీపీ ఎమ్మెల్యే డోలా

సాక్షి నెట్‌వర్క్: టీడీపీ జమానాలో ఆ పార్టీ కొండపి నియోజకవర్గ నాయకుల అకృత్యాలు ఇక్కడి ప్రజలను నేటికీ ఓ పీడకలలా వెంటాడుతున్నాయి. 2014–19 మధ్య అధికారులను కీలు బొమ్మలుగా మార్చి, పోలీసులపై ఒత్తిడి చేసి పచ్చ ముఠా సాగించిన అరాచకాలకు హద్దూ అదుపు లేదు. దామచర్ల కుటుంబానికి తాబేదారుగా విమర్శలు ఎదుర్కొంటున్న టీడీపీ ఎమ్మెల్యే డోలా బాలవీరాంజనేయస్వామి.. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక సభ్యుడైన దామచర్ల సత్యతో కలిసి ఆడిన వికృత క్రీడలో కొందరు ప్రాణాలు కోల్పోగా, వందలాది మంది కేసుల్లో ఇరుక్కుని తీవ్ర మనోవేదనకు గురయ్యారు. వైఎస్సార్ సీపీ అధికారంలో ఉన్నప్పటికీ తప్పుడు కేసులు పెట్టేందుకు ఎమ్మెల్యే స్వామి, సత్య అనుచరులు వెనుకాడలేదు.

దాడులతో జనం బెంబేలు

2014లో స్థానిక సంస్థల ఎన్నికల వేళ టీడీపీ నాయకుల బరితెగించారు. వైఎస్సార్ సీపీ సానుభూతిపరులే లక్ష్యంగా సాగిన ఈ దాడులు సామాన్య ప్రజలనూ భయభ్రాంతులకు గురిచేశాయి. మద్దిపూడి మండలంలోని జి.అగ్రహారం గ్రామంలో ఎంపీటీసీ ఎన్నికల పోలింగ్ సాగుతుండగా వైఎస్సార్ సీపీ అభ్యర్థి భర్త **తేలుకుట్ల వెంకయ్య**పై పచ్చ మూకలు దాడికి తెగబడ్డాయి. తీవ్రంగా గాయపడిన వెంకయ్య ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆ ఎన్నికల్లో ఎంపీటీసీగా వెంకయ్య భార్య **గురవమ్మ** విజయం సాధించినప్పటికీ భర్త మృతితో మనోవేదనకు గురై ఏడాదికే ఆమె కూడా కన్నుమూసింది. మద్దిపూడి మండలం జువ్విగుంటలో ఎంపీటీసీ ఎన్నికల వైఎస్సార్ సీపీ ఏజెంట్ **కముజుల రమణారెడ్డి**పై పచ్చ దండు దాడికి తెగబడింది. పొన్నలూరు మండలంలోని లింగంగుంటలో 2017లో వినాయక నిమజ్జనానికి వెళ్తున్న టీడీపీ కార్యకర్తలు అరుగుపై కూర్చున్న వైఎస్సార్ సీపీ సానుభూతిపరులపై పసుపు రంగు చల్లారు. ఇదేమని ప్రశ్నిస్తే అరుగును ధ్వంసం చేశారు. ఆ మరుసటి రోజు వైఎస్సార్ సీపీ సానుభూతిపరుడు **ఎనిమిరెడ్డి పెద బ్రహ్మారెడ్డి**పై ఇటుకరాయితో దాడి చేయడంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించారు. సింగరాయకొండ మండలంలోని పాకల పల్లెపాలెంలో 2016లో వినాయకచవితి ఉత్సవాల సమయంలో హిజ్రాలతో స్టేజీపై డాన్స్ వేయించడాన్ని అడ్డుకున్న అప్పటి ఎస్సై వైవీ రమణయ్యపై పచ్చ దండు మూకుమ్మడిగా దాడి చేసి గాయపరచడం వారి బరితెగింపునకు పరాకాష్టగా నిలిచింది. టీడీపీ గద్దె దిగి వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చినా పచ్చ ముఠా తీరు మారలేదు. జరుగుమల్లి మండలంలోని పీరాపురంలో 2020లో వైఎస్సార్ సీపీ నాయకుడు అలికేపల్లి మల్లికార్జునరెడ్డి, ఆయన తల్లిపై టీడీపీ మద్దతుదారులు దాడికి పాల్పడ్డారు. పీరాపురంలో గత ఏడాది గ్రామ వలంటీర్ బండి శ్రీనివాసులరెడ్డి, అతని బాబాయి రమణయ్యపై దాడి చేసి తల పగలగొట్టారు.





దాడిలో మృతి చెందిన తేలుకుట్ల గురవయ్య, మనస్థాపంతో మృతి చెందిన ఎంపీటీసీ గురవమ్మ(ఫైల్)



కె.రమణారెడ్డి(ఫైల్)



పొన్నలూరు : లింగంగుంటలో టీడీపీ నేతల దాడిలో గాయపడి చికిత్స పొందుతూ మరణించిన ఎనిమిరెడ్డి పెద్ద బ్రహ్మారెడ్డి(ఫైల్)

అట్రాసిటీ చట్టం.. టీడీపీ నేతల చుట్టం

ఎస్సీఎస్టీల అణచివేతను అడ్డుకునేందుకు రూపొందించిన అట్రాసిటీ చట్టం టీడీపీ నేతలకు చుట్టంగా మారింది. 2015లో కొండపి మండలం నెన్నూరుపాడులో టీడీపీని వీడిన ఏడుగురు వ్యక్తులపై ఆ పార్టీ నాయకుడు తిప్పారెడ్డి కృష్ణారెడ్డి ఎస్సీఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టించాడు. 2016లో జరుగుమల్లి మండలం పీరాపురంలో కుంటలు తవ్వకుండానే ఉపాధి హామీ నిధులు రూ.15 లక్షలు బిల్లులు ఎలా చేసుకున్నారని ప్రశ్నించిన ఐదుగురిపై టీపీ రవికుమార్‌తో అట్రాసిటీ కేసులు పెట్టించి పోలీసులతో కొట్టించారు. 2017లో టంగుటూరు మండలం బుచ్చిరాజుపాలేనికి చెందిన యువకుడు వైఎస్సార్ సీపీలో చురుగ్గా ఉండటాన్ని జీర్ణించుకోలేక టీడీపీ నేత కామని నాగశ్రీను దాడి చేశాడు. ఆ విషయం తెలిసి ధర్నాకు దిగిన అంబేడ్కర్ నగర్, అరుంధతి నగర్, బుచ్చిరాజు మాలపల్లెకు చెందిన ఎస్సీలను ఎమ్మెల్యే స్వామి పోలీసులతో కొట్టించాడు. ఎస్సీలపైనే ఎస్సీ ఎస్టీ కేసులు పెట్టించడం అప్పట్లో సంచలనంగా మారింది. వర్షానికి దెబ్బతిన్న పంట నమోదులో వ్యవసాయ శాఖ సిబ్బంది శ్రీను అక్రమాలకు పాల్పడుతున్నాడని ప్రశ్నించినందుకు జరుగుమల్లి మండలం నర్సింగోలు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత పాటిబండ్ల నాగేశ్వరరావుపై అట్రాసిటీ కేసు పెట్టారు. మూడేళ్ల తర్వాత న్యాయస్థానం అక్రమ కేసుగా తేల్చి కొట్టేసింది. 2018లో టంగుటూరు అంబేడ్కర్ నగర్‌లోని ప్రభుత్వ స్థలంలో వాలీబాల్ ఆడుతున్న యువకులను టీడీపీ నాయకుడు పమిడి ఓం ప్రకాష్ అడ్డుకున్నాడు. అయితే యువకులకు మద్దతుగా నిలిచిన వైఎస్సార్ సీపీ సానుభూతిపరుడు దుగ్గిరాల పేర్రాజు ఇంటిపై పచ్చ మూక దాడిచేసి గాయపరిచింది. దీనిపై పేర్రాజు పోలీసులకు ఫిర్యాదు చేయగా.. తన తల్లిపై అత్యాచారయత్నం చేశారంటూ పేర్రాజు, నవీన్‌పై ఎమ్మెల్యే స్వామి అండతో ఓం ప్రకాష్ అట్రాసిటీ కేసు పెట్టించాడు. 2019లో టంగుటూరులో వైఎస్సార్ సీపీలోని రెండు వర్గాల మధ్య విభేదాలను ఆసరాగా చేసుకుని వారు గొడవపడేలా చేసిన ఎమ్మెల్యే స్వామి.. పోలీసులను ఉసిగొల్పి ఎస్సీ ఎస్టీ కేసులు నమోదు చేయించి, 20 రోజుల పాటు ఊరు వదిలి వెళ్లిపోయేలా చేశాడు.



జరుగుమల్లి : పీరాపురంలో పచ్చ మూకల దాడిలో గాయపడిన బండి రమణయ్య(ఫైల్)

వేధింపులకు కొదవలేదు

జరుగుమల్లి మండలం పీరాపురంలో 2017లో తన ఇల్లు ఆక్రమించుకున్న టీడీపీ నాయకులను ప్రశ్నించిన వైఎస్సార్ సీపీ నాయకుడు మారంరెడ్డి మాలకొండయ్యపై దాడి చేయడమే కాకుండా 6 వేర్వేరు కేసులు బనాయించారు. వైఎస్సార్ సీపీలో చేరాడన్న అక్కసుతో జరుగుమల్లి మండలం పచ్చవకు చెందిన కుంచాల మహేంద్రపై 2019లో గ్రామ టీడీపీ నాయకుడు తాటికొండ రాంబట్లు అత్యాచారం కేసు నమోదు చేయించాడు. కొండపి జెడ్పీటీసీ సభ్యురాలు మారెడ్డి అరుణకుమారి భర్త వెంకటాద్రికి గుర్రప్పడియలో ఉన్న పొలానికి విద్యుత్ సరఫరాను టీడీపీ నేతలు నిలిపేయడంతో హైకోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకుని సరఫరా పునరుద్ధరించుకున్నారు.

భూకబ్జాలకు అంతులేదు

జరుగుమల్లి మండలంలోని నర్సింగోలు గ్రామానికి చెందిన నలుగురు గ్రామ నౌకర్లు షేక్ మీరాసాహెబ్, కూచిపూడి లోకయ్య, కూచిపూడి ఆశీర్వాదం, ఎండూరి మరియమ్మకు 1976లో అప్పటి ప్రభుత్వం 12 ఎకరాలు పంపిణీ చేసింది. ఆ భూమిలో టీడీపీ సర్పంచ్ కోటేశ్వరరావు నీరు–చెట్టు పథకం కింద చెరువు తవ్వించి రూ.20 లక్షల బిల్లులు నొక్కేయడంతో నలుగురు గ్రామ నౌకర్లు మనస్థాపం చెంది మరణించారు. ఇదే మండలం నర్సింగోలులో టీడీపీ సర్పంచ్ కోటేశ్వరరావు 5 ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమించి చెరువుగా మార్చి పక్క పొలాలకు ఇప్పటికీ నీరు అమ్ముకుంటున్నాడు. పొన్నలూరు చెరువులో రూ.1.30 కోట్ల విలువైన సుమారు 30 ఎకరాల భూమిని టీడీపీ ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ తండ్రి ప్రకాశం ఇంజినీరింగ్ కాలేజి అధినేత కంచర్ల రామయ్య, కొందరు టీడీపీ నాయకులు ఆక్రమించి తమ స్వాధీనంలో ఉంచుకున్నారు.



పొన్నలూరు చెరువు భూమిని ఆక్రమించి గ్రావెల్ రోడ్డు వేసిన ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ తండ్రి రామయ్య

'దేశంలో 70 కోట్ల మంది జీవనోపాధి భద్రతకు వ్యవసాయమే వెన్నెముక' అని సేద్యం ప్రాముఖ్యతను చాటారు భారత హరిత విప్లవ పితామహుడు, వరల్డ్ ఫుడ్ ప్రైజ్ గ్రహీత ఎంఎస్ స్వామినాథన్. వ్యవసాయం ప్రతిక్షణం ఎగిసిపడే కెరటం.. ప్రపంచానికి సాయం చేయడానికి ప్రతిసారీ పడి లేస్తుంది. స్వేదంతో సేద్యం చేసి తన బతుకును అన్నం మెతుకుగా మార్చే రైతులకు కష్ట సమయంలో పాలకులు చేయూతనివ్వాలి. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అదే పని చేశారు. రాష్ట్ర చరిత్రలోనే కాదు దేశ చరిత్రలో కూడా ఎన్నడూ లేని విధంగా అన్నదాతలకు అన్ని విధాలా అండగా నిలిచారు. రైతు భరోసా కేంద్రాల ఏర్పాటు మొదలు రైతులకు అవసరమైన ప్రతి విషయంలోనూ ప్రభుత్వం తరఫున చేయూతనిచ్చి వ్యవసాయాన్ని పండగ చేశారు. రైతుల ఐదు వేళ్లూ మట్టిని ముద్దాడితేనే ప్రజలకు అన్నం ముద్ద దొరుకుతుందన్న సత్యాన్ని మరిచి 'వ్యవసాయం దండగ' అని తన 'మనసులో మాట' చెప్పిన చంద్రబాబు పాలనను, రైతు సంక్షేమమే పరమావధిగా సీఎం వైఎస్ జగన్ చేసిన కృషిని ప్రజలు బేరీజు వేసుకుంటున్నారు.

– సాక్షి నెట్‌వర్క్



సేద్యం.. సమున్నతం

రైతులకు భరోసా



రాష్ట్రంలో గ్రామ/వార్డు సచివాలయ వ్యవస్థ ఏర్పాటుతో పాలనలో నూతన ఒరవడికి శ్రీకారం చుట్టిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేకంగా రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి అన్నదాతలకు అండగా నిలిచారు. జిల్లాలో ఐదు లక్షల మందికి పైగా అన్నదాతలకు సేవలందించేందుకు 616 రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేశారు. నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను గ్రామంలోనే అందజేయడం, ఆర్బీకేల్లో కియోస్క్ యంత్రాల ఏర్పాటుతో సాంకేతికత జోడించడం, ఎప్పటికప్పుడు పంట నమోదు, ఉచిత పంటల బీమా, దెబ్బతిన్న పంటలకు తక్షణమే పరిహారం తదితర సేవలన్నీ రైతు భరోసా కేంద్రాలే వేదికగా అందించేందుకు సీఎం వైఎస్ జగన్ చేపట్టిన చర్యలు రైతుల్లో మరింత సంతోషాన్ని నింపాయి. ధాన్యం కొనుగోళ్లు, గిట్టుబాటు ధరల కల్పనలోనూ రాష్ట్ర ప్రభుత్వం చూపిన చొరవ రైతులకు మరింత మేలు చేసింది. వైఎస్సార్ రైతు భరోసా పథకం కింద ఏటా పెట్టుబడి సాయంగా ఇస్తున్న రూ.13,500 రైతులకు ఆర్థికంగా ఊతమిచ్చింది. ఇన్‌పుట్ సబ్సిడీ, వైఎస్సార్ సున్నా వడ్డీ రుణాల మంజూరు చేసి రైతులను సాగు దిశగా మరింత ప్రోత్సహించింది.

డ్రిప్.. టాప్

జిల్లాలో బిందు సేద్యానికి ప్రభుత్వ ప్రోత్సాహం

- డ్రిప్ లక్ష్యం 10,300 హెక్టార్లు కాగా 7,600 హెక్టార్లలో ఏర్పాటు
- రైతులకు 90 శాతం సబ్సిడీ కింద రూ.71.15 కోట్లు అందజేత

డీప్ బోర్లను నమ్ముకుని వ్యవసాయం చేస్తున్న రైతులను బిందు సేద్యం దిశగా ప్రోత్సహించడంలో రాష్ట్ర ప్రభుత్వం సఫలమైంది. జిల్లాలో 10,300 హెక్టార్లలో డ్రిప్ ఏర్పాటు లక్ష్యం కాగా ఇప్పటికే 7,600 ఎకరాల్లో 6,368 మంది రైతులు బిందు సేద్యం పద్ధతిలో పంటలు సాగు చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఐదెకరాల లోపు ఉన్న రైతులకు 90 శాతం, 5 నుంచి 10 ఎకరాల్లోపు ఉన్న రైతులకు 70 శాతం సబ్సిడీపై డ్రిప్ పరికరాలు అందించింది. జిల్లాలో మార్కాపురం నియోజకవర్గంలో 1,588 హెక్టార్లలో 1378 మంది రైతులకు డ్రిప్ పరికరాలు అందించారు. ఇక్కడ లక్ష్యం 1250 హెక్టార్లు కాగా, లక్ష్యానికి మించి రైతుల పొలాలకు డ్రిప్ సిస్టం ఏర్పాటు చేశారు. యర్రగొండపాలెంలో 1540 మంది రైతులకు 1790 హెక్టార్లలో, దర్శిలో 1213 మంది రైతులకు 1212 హెక్టార్లలో, గిద్దలూరులో 658 మంది రైతులకు 711 హెక్టార్లలో, కొండపిలో 708 మంది రైతులకు 839 హెక్టార్లలో, కనిగిరిలో 705 మంది రైతులకు 904 హెక్టార్లలో, ఒంగోలులో 60 మంది రైతులకు 55 హెక్టార్లలో, సంతనూతలపాడులో 106 మందికిగాను 108 హెక్టార్లలో డ్రిప్ సిస్టం ఏర్పాటు చేశారు. వీరికి 90 శాతం రాయితీ కింద ప్రభుత్వం రూ.71.15 కోట్లు అందజేసింది. డ్రిప్ పరికరాలు పాడైతే సంబంధిత కంపెనీ ఐదేళ్ల వరకూ ఉచిత సర్వీసు అందించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది.



కౌలు రైతులకు అండ

జిల్లాలో 5,802 మందికి వైఎస్సార్ రైతు భరోసా

సీసీఆర్‌సీ కార్డులు పొందిన కౌలు రైతులతో పాటు అటవీ, దేవదాయ భూములను సాగు చేసుకునే కౌలు రైతులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలిచింది. జిల్లాలో 5,802 మంది కౌలు రైతులకు వైఎస్సార్ రైతు భరోసా కింద రూ.4.35 కోట్ల నగదు అందజేసింది. 2023 మే నుంచి ఆగస్టు వరకు సంభవించిన అకాల వర్షాలు, వరదలతో పంట నష్టపోయిన 47 మంది రైతులకు తొలిసారి ఇన్‌పుట్ సబ్సిడీ కూడా అందజేసింది. దేశంలో ఎక్కడా లేని విధంగా కౌలు రైతులకు సైతం రైతు భరోసా పథకం వర్తింపజేయడంపై లబ్ధిదారులతోపాటు రైతు సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు.



పొలం బడిలో ఉద్యాన రైతులకు అవగాహన

యంత్రమెట్టా నడుస్తున్నదంటే..

రైతులకు వరంగా వైఎస్సార్ యంత్ర సేవా పథకం

- 616 సీహెచ్‌సీ సెంటర్ల ద్వారా 370 ట్రాక్టర్లు, 5700 పనిముట్లు పంపిణీ
- రైతులకు రూ.21 కోట్లకు పైగా సబ్సిడీ

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన యంత్రసేవా పథకం పంటల సాగుకు ఉపయుక్తంగా మారింది. జిల్లాలోని 616 రైతు భరోసా కేంద్రాల పరిధిలో 616 సీహెచ్‌సీ(కమ్యూనిటీ హైరింగ్ సెంటర్)లు ఏర్పాటు చేశారు. గ్రూపులో సభ్యులైన రైతులకు వైఎస్సార్ యంత్ర సేవా పథకం కింద రూ.15 లక్షల విలువైన ట్రాక్టర్లు, ట్రక్కులు, గొర్రులు, నాగళ్లు, విత్తనపు గొర్రులు, తైవాన్ స్ప్రేయర్లు, ట్రాక్టర్ మౌంటెడ్ స్ప్రేయర్లు, రొటోవేటర్లు, నూర్పిడి యంత్రాలు అందజేశారు. దీంతో రైతులకు వేల రూపాయల అద్దెల భారం తప్పింది. జిల్లాలో సుమారు 370 ట్రాక్టర్లు, 5700 వరకు వ్యవసాయ యంత్రాలు, పనిముట్లను రైతులకు జిల్లా వ్యవసాయశాఖ అధికారులు అందించారు. ఇందుకుగాను మొత్తం రూ.60 కోట్లు వ్యయం కాగా రైతులకు రూ.21 కోట్లను ప్రభుత్వం సబ్సిడీ రూపంలో అందించింది.



రైతులకు యంత్రాలు అందిస్తున్న అధికారులు(ఫైల్)









వైఎస్సార్ సున్నా వడ్డీ

జిల్లాలో 2021–22 రబీ, 2022 ఖరీఫ్‌కు సంబంధించి పంట రుణాలు తీసుకున్న 39,260 మంది రైతులకు రూ.11.02 కోట్ల మేర ప్రభుత్వం వైఎస్సార్ సున్నా వడ్డీ కింద లబ్ధి చేకూర్చింది. పంట సాగు నిమిత్తం రూ.లక్ష లోపు రుణాలు తీసుకుని ఏడాదిలోగా తిరిగి చెల్లించిన రైతులకు సున్నా వడ్డీని వర్తింపజేశారు.



ఇన్‌పుట్ సబ్సిడీ లబ్ధిదారుల వివరాలు

గడిచిన ఐదేళ్లలో అకాల వర్షాలతో పంట నష్టపోయిన 1,87,691 మంది రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ కింద ప్రభుత్వం అందించిన నగదు రూ.149.21 కోట్లు

సంవత్సరం	పంట నష్టపోయిన రైతులు	ఎకరాలు	విలువ(రూ.కోట్లలో)
2019	1510	2,197.4	0.55
2020	1,34,623	2,30,876.05	103.38
2021	18,715	29,966.82	16.47
2022	28,727	63,147.08	25.63
2023	341	606.52	0.34
2023 మిచాంగ్	3,775	4,975.9	
మొత్తం	1,87,691	3,32,215.72	149.21

వైఎస్సార్ రైతు భరోసా లబ్ధిదారుల వివరాలు

గడచిన ఐదేళ్ల వ్యవధిలో జిల్లాలోని 2,95,585 రైతులకు పెట్టుబడి సాయంగా వైఎస్సార్ రైతు భరోసా–పీఎం కిసాన్ పథకం కింద అందించిన నగదు రూ.1920.80 కోట్లు.

నియోజకవర్గం	లబ్ధిదారులు	లబ్ధి(రూ.కోట్లలో)
దర్శి	44,372	278.90
గిద్దలూరు	43,474	269.42
కనిగిరి	44,879	266.01
కొండపి	40,930	263.32
మార్కాపురం	34,253	314.01
ఒంగోలు	10,517	69.88
సంతనూతలపాడు	31,559	204.32
యర్రగొండపాలెం	45,601	254.90
మొత్తం	2,95,585	1,920.80

సుగంధాల సిరి.. ఉద్యానానికి ఊపిరి

- ఏటా రూ.12 కోట్ల వరకు రాయితీ
- సుగంధ పంటల సాగుకూ ప్రోత్సాహం

రాష్ట్ర ప్రభుత్వ ప్రోత్సాహంతో జిల్లాలో ఏటా ఉద్యానవన పంటల సాగు విస్తీర్ణం పెరుగుతూ వస్తోంది. జిల్లాలో సుమారు లక్ష ఎకరాల్లో పూలు, పండ్లు, కూరగాయలు, ఔషధ, సుగంధ పంటలను సైతం పండిస్తూ రైతులు లాభాలు పొందుతున్నారు. అత్యధికంగా 78 వేల ఎకరాల్లో మిరప, పది వేల ఎకరాల్లో బత్తాయి, నిమ్మ సాగు చేస్తుండగా.. ఏటా 4.18 లక్షల టన్నుల ఉద్యాన దిగుబడులు వస్తున్నాయి. ఉద్యాన రైతులకు ఏటా రూ.10 కోట్ల నుంచి రూ.12 కోట్ల వరకు రాయితీలు అందిస్తున్నట్లు ప్రభుత్వ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. షేడ్ నెట్ కింద కూరగాయలు, పూల సాగు, ఉద్యాన పంటల సాగుకు అవసరమైన నీటి కుంటల నిర్మాణానికి ప్రభుత్వం 50 శాతం రాయితీ ఇస్తోంది. రైతు ఉత్పత్తిదారుల సంఘాలను ఏర్పాటు చేసి అవగాహన కల్పించడం ద్వారా ఉద్యాన పంటల దిశగా రైతులను ప్రోత్సహిస్తోంది. జిల్లాలో అరోమా మిషన్ ద్వారా సుగంధ పంటల సాగును రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. పామ్ రోసా, లెమన్ గ్రాస్, వట్టి వేరు పంటలను 21 మంది రైతులు 128 ఎకరాల్లో సాగు చేస్తూ లాభాలు గడిస్తున్నారు.





ఒంగోలు డెయిరీకి బొంద హెరిటేజ్‌కు దోచిపెట్టావు సంపద

